# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 148 | విశాఖపట్నం | 28-2-2026 శనివారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 148 | VISAKHAPATNAM | 28-2-2026 SATURDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇన్‌చార్జ్: డి. లావణ్య

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902


# వేసవి ముందే భానుడి భగభగలు

## వేడి, ఉక్కపోతతో ప్రజల ఇబ్బందులు




**అమరావతి, పతాకం న్యూస్:** వేసవి రాకముందే రాష్ట్రంలో భానుడి ఉష్ణ ప్రతాపం మొదలైంది. ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్నాయి. వేడి, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణ మార్పుల ప్రభావంతో ఈ ఏడాది వేసవికి ముందుగానే భానుడి తాపం మొదలైంది. ఫిబ్రవరిలోనే ఎండలు మండి పోతున్నాయి. మార్చిలో వేడి, ఉక్కపోత మరింత పెరగనుంది. వచ్చే నెల తొలి వారంలో దేశంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 6.5 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యే అవకాశముందని భారత వాతావరణ విభాగం పేర్కొంది. రాజస్థాన్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌తోపాటు పశ్చిమ, దక్షిణ భారతంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 34 నుంచి 37 డిగ్రీల మధ్యలో నమోదవుతాయని అంచనా వేస్తోంది. మన రాష్ట్రంలో మార్చి తొలిరోజుల్లోనే గరిష్ఠ ఉష్ణోగ్రతలు 36 డిగ్రీలు దాటే అవకాశముంది. కోస్తా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు పెరుగుతాయని అంచనా. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా పొడి వాతావరణం ఏర్పడే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. ఉత్తర కోస్తాలో ఒకటి, రెండు చోట్ల పొగ మంచు కురవొచ్చని తెలిపింది. గురువారం రాష్ట్రంలో ఎండ తీవ్రత కొనసాగింది. అత్యధికంగా అనంతపురంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 36.6 డిగ్రీలుగా నమోదైంది. నరసాపురం, మచిలీపట్నం, కావలి తదితర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 డిగ్రీలు పెరిగాయి.

గత ఏడాది కూడా: గత ఏడాది ఫిబ్రవరి నెల మొదటి వారంలోనే ఎండలు విజృంభించాయి. అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సగటు ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలకు పైగా నమోదయ్యాయి. ఏటా మార్చి-ఏప్రిల్‌లో మంట పుట్టించే ఎండలు ముందే చుక్కలు చూపించాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి. అసాధారణ వేడి ఉక్కపోతే ఉక్కిరిబిక్కిరి చేశాయి. ప్రస్తుతం గరిష్ట ఉష్ణోగ్రతలు 35డిగ్రీలకు మించి నమోదవుతున్నాయి. మరో ఐదారు డిగ్రీలు పెరిగితే అడుగు బయటకు పెట్టే పరిస్థితి ఉండదు. చలికాలంలో కాస్త రిలాక్స్ కోసం టీ, కాఫీ తీసుకోవడం సహజమే. ఎండాకాలంలో ఉపశమనం ప్రకృతి సిద్ధమైన పానీయాలు తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. టీ, కాఫీ బదులు పళ్ల రసాలు, పానీయాలు తీసుకోవడం వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుందని చెబుతున్నారు. ఎండాకాలంలో ఎక్కడెక్కడో పని చేసుకొని ఇంటికి వచ్చేసరికి అలసట వచ్చేస్తుంది. చిన్న చిన్న పనులకే నీరసపడిపోతుంటాం. అలవాటు ఉన్న వాళ్లు అలసట బారి నుంచి ఉపశమనం పొందడానికి టీ, కాఫీ తీసుకుంటారు. కానీ వేసవిలో వేడి పదార్థాలు పెద్దగా రుచించవు. కాస్త చల్లచల్లగా ఏవైనా పళ్లరసాలు తీసుకుంటే బాగుంటుంది అనిపిస్తుంది. సహజ పానీయాలైన పళ్ల రసాలను తీసుకోవడమే మంచిదని, తద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయని, అలసట దూరమవుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

వేసవి దాహార్తి తీర్చుకోవడంలో చాలా మంది కొబ్బరి నీళ్లకే మొగ్గు చూపుతారు. ప్రకృతి సిద్ధమైన కొబ్బరి నీళ్లు శరీరానికి ఎంతో మేలు చేయడంతో పాటు శరీరాన్ని నాజూగ్గా ఉంచడంలో సహకరిస్తాయి. బాగా అలసటగా అనిపించినప్పుడు కొబ్బరి నీళ్లలో నిమ్మరసం, తేనె, పుదీనా లేదా కొత్తిమీర, సబ్జా గింజలు వేసుకుని తాగితే చాలు. నోటికి రుచిగా ఉండడంతో పాటు అలసటను తగ్గించడంలో కొబ్బరినీళ్లు మేలు చేస్తాయి.

# రాష్ట్రంలో ఇళ్లు లేని వారందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తాం: చంద్రబాబు



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రంలో ఇళ్లు లేని వారందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ ఏడాది ఉగాదికి ముందే 3 లక్షల ఇళ్లల్లో గృహ ప్రవేశాలు చేయబోతున్నామని చెప్పారు. గృహ నిర్మాణంపై శాసనసభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ 2026 చివరి కల్లా 10 లక్షల 60వేల ఇళ్లల్లో గృహ ప్రవేశాలు జరగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వ హయంలో జరిగిన గృహ నిర్మాణంలో అవినీతిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇళ్ల నిర్మాణాలకు కేంద్రం కూడా నిధులు ఇస్తుందని తెలిపారు. ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు వివరాలు సేకరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఇళ్ల నిర్మాణానికి అదనపు ఆర్థికసాయం చేస్తామన్నారు. ఇళ్ల నిర్మాణం ద్వారా పేదలకు భద్రత, భరోసా కల్పిస్తామని హామీ ఇచ్చారు. 2029లోగా అర్హులందరికీ ఇంటి స్థలాలు, ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు.

# నేను ఆరోగ్యంగానే ఉన్నా: బొత్స



**హైదరాబాద్, పతాకం న్యూస్:** తాను ఆరోగ్యంగానే ఉన్నానని మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ తెలియజేశారు. తన ఆరోగ్యంపై ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. రొటీన్ చెకప్‌లో భాగంగా ఆసుపత్రికి వచ్చానని బొత్స తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చిన వార్తలకు ఆయన స్పందించారు. తాను ఆరోగ్యంగా ఉన్నానని మరొకసారి తెలియజేశారు.

# ఇంకా ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్న కల్తీ పాల బాధితులు!

**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** కల్తీ పాలను తాగి ఆసుపత్రిపాలైన అనూరియా బాధితులు ఇంకా కోలుకోలేదు. రాజమహేంద్రవరంలోని కిమ్స్, రెయిన్‌బో, రవిచైతన్య ఆసుపత్రి, ఆర్ఎసిసి ఐసియు హాస్పిటల్, డెల్టా ఆసుపత్రుల్లో 15 మంది బాధితులకు చికిత్స అందిస్తున్నారు. తొమ్మిది మంది ఇంకా వెంటిలేటర్‌పైనే ఉన్నారు. వీరిలో ఎనిమిది మంది పరిస్థితి విషమంగా ఉంది. రెయిన్‌బో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురు చిన్నారులు లాలా చెరువుకు చెందిన ఐదు నెలల చిన్నారి రుహాన్యరుద్రితార్వి, రెండున్నరేళ్ల జైక్రిత్ రాజ్, దానవాయి పేటకు చెందిన రెండేళ్ల చిన్నారి డి.రితిక్‌లను వెంటిలెటర్లపై ఉంచి డయాలసిస్ నిర్వహిస్తున్నారు. అలాగేకడలి కృష్ణారావు, ఆర్.సూర్య కుమారి, జి.వెంకటలక్ష్మి, జి.సూర్యారావు, బండారు వీరలక్ష్మిలను కూడా వెంటిలెటర్‌పై పెట్టి డయాలసిస్ చేస్తున్నారు. కల్తీ పాల ఘటన నేపథ్యంలో బాధితులకు అందుతున్న వైద్యం, అధికారులు తీసుకుంటున్న చర్యలు, కేసు తదితర వివరాలపై సిఎం చంద్రబాబు సమీక్ష చేశారు. అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరులోని కలెక్టరేట్ నుంచి ఈ మేరకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ కీర్తి చేకూరి, ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, ఎస్పి డి.నరసింహకిశోర్, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్ఎంసి, పశు సంవర్ధక శాఖ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రస్తుత పరిస్థితులపై సమీక్ష చేశారు. జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఘటనకు మూలాలను గుర్తించి, ఎటువంటి ఉదాసీనతకు తావు లేకుండా భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సేకరించిన సమాచారం సరిగా విశ్లేషించి, సమస్య పరిష్కార మార్గాలను రూపొందించాలన్నారు. స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ ప్రకారం క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆడిట్ ఫలితాలు, ల్యాబ్ రిపోర్టులు క్షేత్ర స్థాయి పరిశీలనలతో సమ్మిళితం కలిగి ఉండాలన్నారు. అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని, ఆమేరకు స్పెషలిస్ట్ డాక్టర్లు అందుబాటులో ఉండేలా, నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. శనివారం మరో సారి సమీక్ష నిర్వహిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి కల్తీ పాల ఘటన వివరాలను సిఎంకు తెలిపారు. కిమ్స్ ఆసుపత్రిలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వృద్ధులు ఈనెల 22న అడ్మిట్ అయ్యారన్నారు. చౌడేశ్వర నగర్, స్వరూప నగర్, లాలా చెరువు ప్రాంతాల నుంచి వివిధ ఆసుపత్రుల్లో చేరారనీ తెలిపారు. ప్రాథమిక క్లినికల్ ఫలితాల ఆధారంగా, విషపూరిత



పాల కారణంగా కిడ్నీ పనితీరు తగ్గినట్లు, సీరం క్రియేటినిన్ స్థాయిలు పెరగడం వల్ల తీవ్రత ఎక్కువ ఉందని వైద్యులు తెలిపారన్నారు. ఎపిడెమియోలాజీ పరిశీలనలో కల్తీ పాలు విషయాన్ని ప్రాథమికంగా గుర్తించామన్నారు. నమూనాల పరీక్షల వివరాలు వస్తే స్పష్టత వస్తుందన్నారు. కల్తీ పాలకు కారణమైన వరలక్ష్మి డెయిరీని సీజ్ చేశామన్నారు. 20 మంది బాధితులుకాగా వారిలో ఐదుగురు మృతి చెందారని 15 మంది చికిత్స పొందుతున్నారని తెలిపారు. క్షేత్ర స్థాయిలో 9 వైద్య బృందాలు 110 గహాలను సందర్శించి 315 మంది రక్త నమూనాలను సేకరించామన్నారు. జిల్లాలో ప్రత్యేక విజిలెన్స్ కమిషనర్ రాహుల్ మీనా ఆధ్వర్యంలో 14 సర్వైవల్ బృందాల ద్వారా 957 కుటుంబాలను ప్రతిరోజూ స్క్రీనింగ్ చేస్తున్నామన్నారు. రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పర్యవేక్షణలో చికిత్స పొందుతున్న బాధిత కుటుంబాలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నాయన్నారు. విజయవాడ రెయిన్‌బో ఆసుపత్రి సహకారంతో బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఎస్పి నరసింహ కిశోర్ మాట్లాడుతూ సమాచారం అందుకున్న వెంటనే పాల వ్యాపారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ప్రస్తుతం వాస్తవ వివరాలు తెలుసుకునే దిశలో అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.


పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా.. అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా.. పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS

State Bank of India

A/c No: 44576280686

IFSC:SBIN00021297

DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# అరకొరగా రాయితీ పరికరాలు

అనేక కష్టాలు, నష్టాలు ఎదురైనా సరే అన్నదాతలు వ్యవసాయాన్నే నమ్ముకుని సాగు చేస్తున్నారు. ప్రభుత్వ విధానాల కారణంగా అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నారు. ప్రకతి వైపరీత్యాలతో పెట్టుబడులు కోల్పోతున్నారు. వ్యవసాయాన్ని వదలని పరిస్థితి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వాలు సాగులో సహకారం అందించాల్సి ఉంది. పంటల సాగులో ఖర్చును తగ్గించడానికి వ్యవసాయ యాంత్రీకరణను ప్రభుత్వం ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. గత ప్రభుత్వాలు ఈ మేరకు కొంతైనా సహకారం అందించేది. రైతులకు సబ్సిడీపై వివిధ రకాల పరికరాలు అందించడానికి ప్రయత్నం చేసేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ యంత్రాలను రాయితీపై పంపిణీ మాట మరిచింది. అరకొర యంత్రాలను పంపిణీ చేసి చేతులు దులుపుకుందన్న విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. సబ్సిడీపై యంత్రాలను అందించడం ద్వారా రైతులు వీటిని తమ సొంత అవసరాలకు వినియోగించుకోవడంతో పాటు తోటి రైతులకు కూడా తగిన రుసుముతో సేవలు అందించే అవకాశం ఉంటుంది.జిల్లాలో 2.35 ఎకరాల సాధారణ విస్తీర్ణంలో సుమారు 2 లక్షల మంది రైతులు జిల్లాలో వరి, ఇతర పంటలను సాగు చేస్తున్నారు. సుమారు లక్ష ఎకరాల్లో మామిడి, జీడి మామిడి, అరటి తదితర ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు జిల్లాలో వ్యవసాయ, ఉద్యానవన పంటలకు సంబంధించి సబ్సిడీ పరికరాల పంపిణీని విస్మరించారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ గడచి రబీ సాగుతున్నా నేటికీ రాయితీ పరికరాలు అందని పరిస్థితి నెలకొంది. సబ్సిడీ వ్యవసాయ యంత్రాలు కానరాక అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.సీజన్లు ముగిసిపోతున్నా...2025-26 ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్ సీజన్ ముగిసిపోయి, రబీ సీజన్ జరుగుతున్నా జిల్లా రైతులకు ఇంతవరకూ వ్యవసాయ యంత్ర సామగ్రిని రాయితీపై అందజేయలేదు. సంబంధిత వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులను అడిగితే ప్రభుత్వం నుంచి ఇటివలే ఆదేశాలు వచ్చాయని బదులిస్తు న్నారని రైతులు చెబుతున్నారు. దీనిపై జిల్లా అధికారులను వివరణ కోరగా రైతులు తమకు కావాల్సిన యంత్రాలకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేసే అవకాశం ఉందని చెబుతున్నారు.అరకొర మందికే...2024-25 ఆర్థిక సంవత్సరంలో 49 మందికి కిసాన్ డ్రోన్లు అందించగా రూ.3.84 కోట్లు సబ్సిడీ విడుదల అయిందని అధికారులు తెలిపారు. అంతకంటే ముందు సంవత్సరంలో పెండింగ్‌లో ఉన్న పరికరాలను కూడా ఇదే ఆర్థిక సంవత్సరంలో అందించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కేవలం రూ.3.82 కోట్ల విలువైన 688 మంది రైతులకు ఇదే సంఖ్యలో వివిధ రకాల సబ్సిడీ యంత్రాలను పంపిణీ చేశారు. వీటిలో 204 మందికి బ్యాటరీ స్ప్రేయర్లు, 34 మందికి పవర్ స్ప్రేయర్లు, 26 మందికి ట్రాక్టర్ పనిముట్లు, 67 మందికి రోటోవేటర్లు, 10 మందికి పవర్ వీడర్లు, ఆరుగురికి బ్రష్ కటర్లు, 334 మందికి పవర్ టిల్లర్లు అందించారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో పెద్ద ట్రాక్టర్లను కూడా అందించేవారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత తూతూ మంత్రంగా గతేడాది ఏవో కొన్ని యంత్ర పరికరాలను పంపిణీ చేసి చేతులు దులుపుకుంది అంటూ రైతులు ఆరోపిస్తున్నారు. గతంలో ఒక్కొక్కటీ రూ.23 లక్షల ఖరీదు గల వరికోత యంత్రాలను సబ్సిడీపై పంపిణీ చేసేవారని తెలిపారు. ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మినీ ట్రాక్టర్లు, తైవాన్ స్ప్రేయర్లు, ప్రెస్ కట్టర్లు, రోటా వీటర్లు, పవర్ రాడార్ టిల్లర్లను పంపిణీ చేసేవారు. కూటమి వచ్చిన తర్వాత 100 మంది లోపే వీటిని పంపిణీ చేసినట్లు అధికారులు చెప్పుకొస్తున్నారు. ప్రభుత్వం ఏటా రాయితీపై ఇచ్చే వ్యవసాయ యంత్ర పరికరాలను ఖరీఫ్ ఆరంభం నుంచి అందజేయాల్సి ఉంది. కానీ ఈ ఏడాది సబ్సిడీ యంత్రాలను ఏ ఒక్కరికీ అందజేయలేదని రైతులు చెబుతున్నారు.రైతులకు ఎంతో మేలుగత ప్రభుత్వాలు వ్యవసాయంలో యంత్రీకరణను ప్రోత్సహించి తద్వారా కూలి ఖర్చులను తగ్గించడానికి వివిధ రకాల పరికరాలను 50 శాతం సబ్సిడీపై అందించింది. రైతుల్లో సాంకేతిక పరిజ్ఞానం పెరిగే విధంగా అవగాహన కల్పించింది. పంటలకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేసే పంపులు, ట్రాక్టరు ఉపయోగించే నాగళ్లు, డిస్కులు, రోటావేటర్లు, పెట్రోల్ పంపులు, సబ్ మెర్సిబుల్ విద్యుత్ మోటార్లు, ఆయిల్ ఇంజన్లు, ట్రాక్టర్లు ఇలా పలురకాల వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులు సగం ధరకే పొందేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. వ్యవసాయంలో తమకు ఎంతో ఉపయోగపడే పరికరాలను సబ్సిడీపై ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను అందజేయాలని కోరుతున్నారు.

## పీఎం జన్‌మన్ ఇళ్ల నిర్మాణం జరిగేనా?



**అరకులోయ, పతాకం న్యూస్:** పీఎం జన్‌మన్ పథకం కింద పీవీటీజీ తెగకు చెందిన గిరిజనులకు మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు అర్థంతరంగా ఆగిపోయాయి. సకాలంలో నిధులు మంజూరుకాకపోవడంతో లబ్ధిదారులు వివిధ దశల్లో నిర్మాణాలు నిలిపివేశారు. అరకులోయ మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 2,464 మంది పీవీటీజీ గిరిజన లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం పక్కా ఇళ్లు మంజూరు చేసింది. ఈ పథకం కింద ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2,39,000లు ఇస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. తొలి విడతగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో రూ.70 వేలు జమ చేసింది. రూఫ్ లెవెల్‌కు రూ.90 వేలు, శ్లాబ్, ఫినిషింగ్ పనులు పూర్తి చేస్తే రూ.40 వేలు, కూలీ కింద రూ.27 వేలు విడతల వారీగా విడుదల చేస్తామని ప్రకటించింది. అయితే ఇప్పటి వరకు కేవలం 291 ఇళ్లు పూర్తి కాగా, సుమారు 1,637 ఇళ్లు లింటల్ స్థాయిలో నిలిచిపోయాయి. మరో 70 ఇళ్లు ఇంకా ప్రారంభంకాలేదు. మరో 466 ఇళ్లు స్థల సమస్య కారణంగా లబ్ధిదారులకు కేటాయింపులు జరపలేదు. సకాలంలో నిధులు విడుదలకాకపోవడంతో లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టడం లేదు. కాగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత లబ్ధిదారులకు అదనంగా లక్ష రూపాయలు ఇస్తామని ప్రకటించింది. అయితే ప్రకటించి ఏడాదికావస్తున్నా నిధులు విడుదల చేయకపోవడంతో లబ్ధిదారులు నిరుత్సాహం చెందుతున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి నిధులు విడుదల చేయాలని వారు కోరుతున్నారు.

## పెప్టైడ్ ఆధారిత ఔషధాలకు ప్రాధాన్యత




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** మధుమేహం, ఊబకాయం, కేన్సర్, సంక్రమిత వ్యాధుల నివారణలో నాణ్యత, తక్కువ వ్యయం, కచ్చితమైన చికిత్సకు ఉపయోగపడే పెప్టైడ్ ఆధారిత ఔషధాలకు ప్రపంచ వ్యాప్తంగా ప్రాధాన్యత పెరుగుతోందని నిపుణులు అభిప్రాయపడ్డారు. గీతంవర్సిటీ వేదికగా గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, ఫార్మసీ, ఇండియన్ పెప్టైడ్ సొసైటీ (ఐపిఎస్) సంయుక్తంగా నిర్వహించిన 5వ విద్యార్థి వార్షిక సదస్సును సంస్థ అధ్యక్షుడు ప్రొఫెసర్ కె.ఎన్.గణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమరావతి కేంద్రంగా ఏర్పాటవుతున్న క్వాంటమ్‌వ్యాలీ ద్వారా పెప్టైడ్ ఆధారిత ఔషధ పరిశోధనలు వేగవంతం అవుతాయన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ ఎస్.అనంతరామకృష్ణ మాట్లాడుతూ గీతంలో సైన్స్ పరిశోధనలకు రూ.100 కోట్లతో అధునాతన ప్రయోగశాలలు ఏర్పాటు చేశామన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎల్.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 100 కు పైగా పెప్టైడ్ మందులు ఆమోదం పొందాయని భవిష్యత్తులో వీట సంఖ్య మరింతగా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిమ్‌సర్ ప్రోవైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి, గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, ప్రొఫెసర్ ఎ.రామ్‌గోపాల్, కార్యక్రమ కోఆర్డినేటర్‌లు డాక్టర్ శిబాజీబాసక్, డాక్టర్ నితిన్ యాదవ్, డాక్టర్ రాజ్‌దీప్ దాస్, అధ్యాపకులు, విద్యార్థులు, రీసెర్చి స్కాలర్స్ పాల్గొన్నారు.

## 'పది' పరీక్షలకు సర్వం సిద్ధం



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** పదోతరగతి పరీక్షలు మార్చి 16 నుంచి జరగనున్నాయి. జిల్లాలో 145 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నారు. మొత్తం 28,586 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈ మేరకు పరీక్షల ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వం ముమ్మరం చేసింది. పరీక్షల అధికారులు, ఇన్విజలేటర్ల నియామకాన్ని డిజిటల్ విధానంలో ఆటోమేషన్ పద్ధతిలో కంప్యూటర్ ద్వారా చేపట్టడానికి శ్రీకారం చుట్టింది. పరీక్షా కేంద్రాలకు చెందిన చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారులు(డీవో), అదనపు డిపార్ట్‌మెంట్ అధికారులను(ఏడీవో) నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఒక్కో కేంద్రానికి చీఫ్, డీవో నియమించగా విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఉన్న కేంద్రాలకు అదనపు డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించింది. విధుల నుంచి ఎవరికీ మినహాయింపు ఇచ్చేది లేదని ముందుగానే ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఏమైనా అత్యవసర పరిస్థితులు ఎదురైతే సర్దుబాటు చేసుకునేందుకు మండలానికి ఇద్దరు చొప్పున రిజర్వులో ఉంచారు. తాము పనిచేస్తున్న పాఠశాలల విద్యార్థులు పరీక్షలు రాయని కేంద్రాలకు వీరిని నియమించారు. కొందరికి అదే మండలంలో, మరికొందరిని పొరుగు మండలాల్లో నియమించారు. ఆటోమేషన్ విధానంలో నియామకాల వల్ల కొందరు హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లను దూరప్రాంతాల్లో కేంద్రాలకు కేటాయించారు. జిల్లాలో 145 పరీక్ష కేంద్రాలకుగానూ 145 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 145 మంది డీవోలు, మరో 145 మంది అదనపు డీవోలను నియమించారు. ఇంకా సుమారు 1800 మంది ఇన్విజిలేటర్లు, మరో 12 బృందాలకు పర్యవేక్షకులను నియమించనున్నారు.

## ఘనంగా 'సామిల్ ఉత్సవ్'




**ఆనందపురం, పతాకం న్యూస్:** వినియోగించిన వాహనాలు, యంత్రాలు, ఇతర ఆస్తుల వేలంలో దేశవ్యాప్తంగా అగ్రగామిగా నిలిచిన శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్ (సామిల్) 15వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని దుక్కవానిపాలెం టోల్‌గేట్ సమీపంలోని తర్లువాడలో 'సామిల్ ఉత్సవ్ 2026' ఘనంగా నిర్వహించారు. సంస్థ స్టేట్ బిజినెస్ హెడ్ బి. తిమ్మరాజు మాట్లాడుతూ, వినియోగదారుల విశ్వాసాన్ని చూరగొన్న సామిల్, దేశవ్యాప్తంగా 135కు పైగా ఆటోమాల్స్‌లో ఒకేసారి వేలాలు నిర్వహించి అతిపెద్ద ఫిజిటల్ వేలంగా నిలిచిందన్నారు. సంస్థ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా వాహన డ్రైవర్లు, యజమానులు, పేద పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అందిస్తోందన్నారు.కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. లక్కీ డ్రా నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీరామ్ ఫైనాన్స్ జోనల్ బిజినెస్ హెడ్ పి. రమణరాజు, రీజినల్ బిజినెస్ హెడ్ కె.రత్నాకర్, రీజినల్ క్రెడిట్ హెడ్‌లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కరాటే, తైక్వాండో పోటీల్లో అవంతి విద్యార్థుల ప్రతిభ



**తగరపువలస, పతాకం న్యూస్:** విజయనగరం జెఎన్‌టియు, గురజాడ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అంతర విశ్వవిద్యాలయ కరాటే, తైక్వాండో పోటీల్లో అవంతి కళాశాల విద్యార్థులు సత్తాచాటి, అంతర వర్సిటీ జాతీయపోటీలకు ఎంపికయ్యారు. 60కిలలో విభాగం కరాటే పోటీల్లో ఇంజినీరింగ్ ఫస్టియర్ విద్యార్థిని బి.కౌసల్య, తైక్వాండో 62కిలలో విభాగంగా బిటెక్ ఫస్టియర్ విద్యార్థిని ఎల్ఎస్.ఆశ్రిత ఎంపికైనట్లు కాలేజీ పిఇటి తెలిఆపరు. వచ్చేనెల 16 నుంచి 20 వరకు ఒడిశా, భోపాల్ సేజ్ వర్సిటీలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్స్ డాక్టర్ బి మురళీకృష్ణ, డాక్టర్ పూర్ణ నాగశ్రీ, డైరెక్టర్లు డాక్టర్ ఎ. చంద్రశేఖర్, ఎస్. విశ్వప్రసాద్, వ్యాయామ అధ్యాపకులు కోలా చంద్రశేఖర్, చందర్రావు, గాయత్రి అభినందిం చారు.

## సముద్ర జీవన భద్రతపై శిక్షణ




**భీమిలి, పతాకం న్యూస్:** జివిఎంసి నాలుగోవార్డు చేపలుప్పాడ, కొత్తూరు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి కార్యాలయంలో మత్స్యకారులకు 'సముద్ర జీవన భద్రత'పై అవుట్‌రీచ్ నైపుణ్యాభివృద్ధి శిక్షణనిచ్చారు. శిక్షణను మత్స్యశాఖ జెడి పి.లక్ష్మణరావు, ఎఫ్‌డిఒ ఈశ్వరరాజుతో కలిసి సిఐఎఫ్ఎన్ఇటి ,చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ (ఎస్అండ్ఎన్) డాక్టర్ మహాదేవ్ రామ కోకనే ప్రారంభించారు. సముద్రంలో వేటకు వెళ్లే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మత్స్యకారుల భద్రత తదితర అంశాలను వివరించారు. సీ మ్యాన్ షిప్, నావిగేషన్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ రిజేష్ పి మాట్లాడుతూ, ప్రాణాలను కాపాడే పరికరాలు, అగ్నిమాపక ఉపకరణాల వినియోగంపై అవగాహన కల్పించారు. శిక్షణకు హాజరైన 50 మందికి సర్టిఫికెట్లు అందజేశారు

## చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం



**తూర్పుగోదావరి, పతాకం న్యూస్:** ఆనందాలు పంచు కోవడమే కాదు ఆపదలోనూ మేమంతా అండగా ఉంటామని ఆ మిత్ర బృందం విశాల హృదయాన్ని చాటుకుంది. మండలంలోని ఉండ్రాజవరం హైస్కూల్ 1998 పదవ తరగతి విద్యార్థి బృందం క్యాన్సర్‌తో బాధపడుతున్న తమ మిత్రుడు నల్ల శ్రీనివాస్ కుమారుడు అక్షరు వైద్యానికి రూ.1.10 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వర్రె బాబిరమేష్ మాట్లాడుతూ శ్రీనివాస్ ఆర్థిక పరిస్థితి గమనించి, తమ బ్యాచ్‌కు చెందిన పలువురు మిత్రులు స్వచ్ఛందంగా సేకరించిన నగదు, 50 కేజీల బియ్యం, అక్షరుకు బట్టలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు చెన్న శ్రీను, మట్టా శ్రీను, బేతిన శ్రీను, షేక్ షైధిల్, అబ్బిరెడ్డి శివ, మానేపల్లి వాసవి, కడించర్ల దీపిక, మంచేంశెట్టి పద్మావతి, వంగలపూడి శ్రీదేవి, చిలుకూరి నాగజ్యోతి, గరగా దుర్గా తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ వినియోగంపై ఉక్కుపాదం మోపాలి: కలెక్టర్



**బీవనిష్ట్ర పతాకం న్యూస్:** జిల్లాలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగంపై ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి పోలీస్ శాఖను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాల రవాణా నివారణకు పోలీసు, ఫారెస్ట్, ఎక్సైజ్ శాఖలతో జాయింటు ఆపరేషన్ నిర్వహించాలని తెలిపారు. బస్సులు, రైల్వే స్టేషన్లలో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేయాలని సూచించారు. మాదక ద్రవ్యాలు రవాణా, విక్రయం, సరఫరా చేసేవారికి కఠిన శిక్షలు పడేలా బలమైన ఆధారాలు సేకరించాలన్నారు. గంజాయి విక్రయించినా, వినియోగించినా బెయిల్ రాకుండా బైండోవర్ కేసులు నమోదు చేయాలని అధికారులకు సూచించారు. గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, గంజాయి, ఇతర మత్తు పదార్థాల చెడు ప్రభావాలను వివరించాలని ఆదేశించారు. విద్యాసంస్థల వద్ద ఉన్న దుకాణాలను తనిఖీ చేసి మత్తు పదార్థాలు ఉంటే వెంటనే ఆ షాపులను సీజ్ చేసి విచారించాలన్నారు. శాఖల వారీగా మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన కార్యక్రమాలను రీల్స్ రూపంలో చేసి, వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలన్నారు. ప్రతీ గ్రామంలో మహిళా పోలీస్, అంగన్వాడీ కార్యకర్తలతో డ్రగ్స్ వినియోగంపై ర్యాలీ నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. విద్యా సంస్థలలో ఎట్టి పరిస్థితుల్లోనూ మాదక ద్రవ్యాల ప్రభావం పడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యాసంస్థలకు దగ్గరలో ఉన్న మద్యం దుకాణాలను తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరిపే షాపులను మూసివేయించాలని కలెక్టర్ ఆదేశించారు. గుట్కా, సిగరెట్లను పిల్లలకు అమ్మితే ఆయా దుకాణాలను మూసి వేయడమే కాకుండా దుకాణదారుడిపైన కేసులు నమోదు చేయాలన్నారు. నాటుసారా ఎక్కడైనా తయారు చేసిన లేదా వినియోగిస్తున్నట్టు తెలిస్తే పోలీసులకు సమాచారాన్ని అందించాలని కోరారు. రవాణా శాఖ గంజాయి రవాణాపై ఎలాంటి చర్యలు చేపట్టిందో కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు రాని విద్యార్థుల జాబితా సిద్ధం చేయాలని, అలాంటి వారి నడవడికపై దృష్టి పెట్టాలని సూచించారు. పార్వతీపురం మున్సిపాలిటీ పరిధిలో పని చేసే శానిటేషన్ సిబ్బందికి ఎక్కడైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్టు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ పావనిని కలెక్టర్ ఆదేశించారు. ప్రతీ షాప్ దగ్గర సిసి కెమెరాలు ఏర్పాటు చేసేలా దుకాణదారునితో మాట్లాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి ఎస్.వి మాధవ రెడ్డి, సబ్‌కలెక్టర్ ఆర్.వైశాలి, ఎఎస్‌పి మనీషా రెడ్డి, పార్వతీపురం పురపాలక శాఖ కమిషనర్ పావని, జిల్లా ట్రాన్స్పోర్ట్ అధికారి టి.దుర్గా ప్రసాద్, ప్రజా రవాణాధికారి ఎస్.లక్ష్మణ రావు, గిరిజన సంక్షేమ శాఖ డిడి ఎ.విజయ శాంతి, బిసి వెల్ఫేర్ అధికారి ఇ.అప్పన్న, ఇంటర్మీడియట్ బోర్డు అధికారి ఎస్.రమణ ప్రసాద్, స్కూల్ ఎడ్యుకేషన్ అధికారి ఎం.రామజ్యోతి, డిఇఒ రాజ్‌కుమార్, సాలూరు మున్సిపల్ మేనేజర్ శివ ప్రసాద్, కార్మిక శాఖ ఎసిఎల్ సువర్ణ, జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయకర్త జి.నాగభూషణరావు, జిల్లా డీ-అడిక్షన్ సెంటర్ రవి కుమార్, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంలో
# రాజీ పడొద్దు: రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, పతాకం న్యూస్:** కోర్ అర్బన్ రీజియన్‌లో ప్రభుత్వ స్కూల్స్‌లో మౌలిక సదుపాయాల కల్పనపైన దృష్టి సారించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. భారతీయ విద్యా భవన్, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూళ్లల్లో ఉన్న మౌలిక సదుపాయాలు ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఉండాలని సూచించారు. ఐసీసీసీలో ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌పైన సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశానికి సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణా రెడ్డి , విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా , కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కుమార్, అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని మార్గనిర్దేశం చేశారు. బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌లో తప్పనిసరిగా పాలు అందజేయాలని నిర్దేశించారు. ఇందుకోసం విజయా డైరీ నుంచి పాలు సేకరించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత కోసం ఏఐ టెక్నాలజీని వినియోగించాలని దిశానిర్దేశం చేశారు. కోర్ అర్బన్ రీజియన్ మినహా మిగిలిన నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఒక్కొక మండలంలో ఆరుట్ల స్కూల్ తరహాలో ట్రాన్స్‌పోర్ట్‌తో సహా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ట్రాన్స్‌పోర్ట్ కోసం ఎలక్ట్రికల్ బస్సుల ఏర్పాటు పైన అధ్యాయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రైవేట్ స్కూల్స్‌లో నిబంధనలకు మించి ఫీజులు వసూలు చేస్తే అనుమతి రద్దుతో పాటు రికవరీ చేసేలా నిబంధన విధించాలని హుకుం జారీ చేశారు. ప్రైవేట్ స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణకు సంబంధించి రికమండేషన్స్‌ని ప్రజాభిప్రాయం కోసం వెబ్‌సైట్‌లో ఉంచాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అలాగే, ఎంసీహెచ్‌ఆర్‌డీలో గ్రూప్ 2, 3 ఆఫీసర్ల శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు.

# విమాన ప్రయాణికులకు గుడ్ న్యూస్.. టికెట్ రద్దుపై డీజీసీఏ కొత్త రూల్స్




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** విమాన ప్రయాణికులకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) శు భవార్త చెప్పింది. టికెట్ రద్దు, రిఫండ్‌లకు సంబంధించి సివిల్ ఏవియేషన్ రిక్వైర్‌మెంట్స్ (సీఏఆర్)ను సవరిస్తూ కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. దీని ప్రకారం, ప్రయాణికులు టికెట్ బుక్ చేసిన 48 గంటల లోపు ఎలాంటి అదనపు ఛార్జీలు లేకుండానే టికెట్‌ను రద్దు చేసుకోవచ్చు లేదా మార్పులు చేసుకోవచ్చు. ఈ కొత్త నిబంధనలు మార్చి 26 నుంచి అమల్లోకి రానున్నాయి. అయితే, ఈ 'లుక్-ఇన్' పీరియడ్ సదుపాయానికి కొన్ని షరతులు వర్తిస్తాయి. దేశీయ విమాన ప్రయాణానికి కనీసం 7 రోజుల ముందు, అంతర్జాతీయ ప్రయాణానికి 15 రోజుల ముందు బుక్ చేసుకున్న టికెట్లకు మాత్రమే ఈ నిబంధన వర్తిస్తుంది. కేవలం ఎయిర్‌లైన్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా నేరుగా టికెట్లు బుక్ చేసుకున్న వారికే ఈ ప్రయోజనం అందుబాటులో ఉంటుంది. ఒకవేళ వేరే విమానానికి టికెట్ మార్చుకుంటే, ఛార్జీల వ్యత్యాసాన్ని ప్రయాణికులు చెల్లించాల్సి ఉంటుంది. 48 గంటలు దాటిన తర్వాత సాధారణ రద్దు ఛార్జీలు వర్తిస్తాయని డీజీసీఏ స్పష్టం చేసింది. టికెట్లపై పేరు తప్పుగా పడితే, బుక్ చేసిన 24 గంటల్లోపు తెలియజేస్తే ఎలాంటి రుసుము లేకుండా సరిచేసుకోవచ్చని తెలిపింది. ఇక రిఫండ్ల విషయంలోనూ డీజీసీఏ స్పష్టత ఇచ్చింది. ట్రావెల్ ఏజెంట్ల ద్వారా బుక్ చేసుకున్న టికెట్ల రిఫండ్ బాధ్యత కూడా విమానయాన సంస్థలదేనని, 14 రోజుల్లోగా ఆ మొత్తాన్ని వాపసు ఇవ్వాలని ఆదేశించింది. క్రెడిట్ కార్డ్ చెల్లింపుల రిఫండ్‌ను 7 రోజుల్లో, ఆఫీసులో నగదు చెల్లింపులను తక్షణమే పూర్తి చేయాలని పేర్కొంది.

## మోడల్ స్కూల్‌ను సందర్శించిన కేంద్ర బృందం



**నెల్లిమర్ల, పతాకం న్యూస్:** మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాలను సెంట్రల్ టీమ్ సందర్శించింది. సతివాడలోని పిఎంశ్రీ పరిధిలో ఎంపికైన ఆదర్శ పాఠశాలను సెంట్రల్ నోడల్ ఆఫీసర్ ఫర్ పిఎం నీరజ్ కుమార్ గాయగీ, డిఇఒ యు.మాణిక్యం నాయుడు, ఎపిసి డాక్టర్ ఎ.రామారావు సందర్శించారు. ఈ సందర్భంగా వారు పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎటిఎల్ ల్యాబ్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, పాల్ ల్యాబ్‌లను పరిశీలించారు. ల్యాబ్‌లలో ఉన్న సదుపాయాలను, పరికరాలను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించి వారి అభ్యాస విధానంపై ఆరా తీశారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రతిభపై ప్రశంసలు తెలిపారు. పిఎంశ్రీ పాఠశాలలకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను పాఠశాల అభివృద్ధికి, వసతి గృహ సదుపాయాల మెరుగుదలకు సమర్థవంతంగా వినియోగించినందుకు పాఠశాల ప్రిన్సిపాల్ జె.పద్మలతని అభినందించారు. అనంతరం వసతి గృహాన్ని సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని రుచి చూసి భోజనం నాణ్యత బాగుందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్శనలో ఎంఇఒ యు.సూర్య నారాయణ మూర్తి పలువురు అధికారులు పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



**సాలూరు, పతాకం న్యూస్:** ఈదురుగాలులు, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సాలూరు మండలంలో అకాల వర్షాలు, ఈదురు గాలులకు నేలకొరిగిన అరటి, మొక్కజొన్న పంటలను సిపిఎం బృందం పరిశీలించింది. బాధిత రైతులతో మాట్లాడి వివరాలు సేకరించింది. అనంతరం గంగునాయుడు మాట్లాడుతూ మూడు నెలల క్రితం తీవ్రమైన వర్షాలతో జిల్లాలో పత్తి, అరటి రైతులు తీవ్రంగా నష్టపోయారని గుర్తుచేశారు. మరలా ఇప్పుడు అకాలవర్షాలు, ఈదురుగాలులు మొక్కజొన్న, అరటి రైతుల నడ్డి విరిచాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఎరువుల ధరలు, మదుపులు పెరగడంతో వ్యవసాయం తీవ్ర భారమైన పరిస్థితుల్లో రైతులు ఉన్నారని తెలిపారు. చేతికి పంట వచ్చే దశలో అరటి, జొన్న ఈదురుగాలులకు నేలకొరగడంతో మరోసారి రైతులు తీవ్రంగా నష్టపోయారని వాపోయారు. జిల్లా వ్యాప్తంగా పంట నష్టాన్ని వెంటనే అంచనా వేసి, ఎకరా అరటికి రూ.లక్ష, మొక్కజొన్నకు రూ.75 వేలు చొప్పున రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్‌వై నాయుడు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.శ్రీను, మండల నాయకులు ఎస్.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలు

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** బాలికపై లైంగిక దాడికి పాల్పడి, ఆపై హత్య చేసిన కేసులో ముద్దాయికి ఇరవై ఏళ్లపాటు కారాగార శిక్ష విధిస్తూ విశాఖలోని పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి పి.మంగకుమారి తీర్పు చెప్పారు. ఈ కేసుకు సంబంధించి ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బత్తి రాజశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలంలో ఒక గ్రామానికి చెందిన పాంగి రమేశ్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. 2024 జనవరి 2వ తేదీన అదే గ్రామంలో పీవీటీజీకి చెందిన ఆరో తరగతి చదువుతున్న 11 ఏళ్ల బాలికకు మాయమాటలు చెప్పి తన ఇంట్లోకి తీసుకువెళ్లాడు. ఆమెపై అత్యాచారానికి పాల్పడి, అనంతరం హత్య చేశాడు. చున్నీతో దూలానికి ఉరివేసి, బాలిక ఆత్మహత్య చేసుకున్నట్టు గ్రామస్థులు భావించేలా చేశాడు. ఈ సంఘటనపై బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి చింతపల్లి ఏఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిశోర్ పర్యవేక్షణలో పోలీసులు కేసు నమోదుచేసి నిందితుడిని అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు పూర్తయిన తరువాత పోక్సో కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. పోలీసుల తరపున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బత్తి రాజశేఖర్ వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి పాంగి రమేశ్‌కు 20 సంవత్సరాల కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి గురువారం తీర్పు చెప్పారు. జరిమానా సొమ్ములో రూ.50 వేలు బాధిత కుటుంబానికి, రూ.50 వేలు ప్రభుత్వానికి చెల్లించాలని ఆదేశించారు.

## మూతపడిన పరిశ్రమలను తెరిపించాలి




**విజయనగరం, పతాకం న్యూస్:** జిల్లాలో సుమారు 25పరిశ్రమలు మూతపడి 15వేల మంది కార్మికులకు ఉపాధి పోయిందని, 5ఏళ్ల క్రితమే పరిశ్రమలు ఏర్పాటు కోసం 3000 ఎకరాలు సేకరించారని, ఇప్పటికీ ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు కాలేదని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.సురేష్, టివి రమణ అన్నారు. ఈనెల 28న విజయనగరం జిల్లాకు వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మూతపడిన పరిశ్రమలను తెరిపించేందుకు స్పష్టమైన ప్రకటన చేసే విధంగా తెలుగుదేశం కూటమి పెద్దలు కృషి చేయాలని కోరారు. కెఎల్ పురం సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వలసల్లో అగ్ర భాగాన, అభివృద్ధి, ఉపాధి కల్పనలో చివరి స్థానంలో విజయనగరం జిల్లా ఉందన్నారు. జిల్లాలో పరిశ్రమల మూత పరంపర కొనసాగుతుందని గరివిడి ఫేకర్, గర్భం ఆంధ్ర ఫెర్రో ఎల్లాయిస్, కొత్తవలస జిందాల్, బొబ్బిలి గ్రోత్ సెంటర్, చిన్నాపురం ఎఎస్ , కొత్తవలస ఉమా ,రాజాంలో 3 జ్యూట్ మిల్లులు, భీమసింగి సుగర్స్ , గజపతి నగరంలో ఓలం తో సహా చిన్న చితకా పరిశ్రమలు 25 వరకూ మూతపడ్డాయని తెలిపారు. ఫలితంగా 15వేల మందికి ఉపాధి పోయిందన్నారు. బొబ్బిలి గ్రోత్ సెంటర్లో 308.49 , కొట్టక్కిలో 162.07 , కొండకిండాం లో 30.20, బలిఘట్టాం లో 34.97, ఎస్.కోటలో 1163.43, జిఎంఆర్‌కు కొత్తవలస, భోగాపురంలో 1140 ఎకరాల చొప్పున ఐదేళ్ల క్రితమే రైతుల వద్ద భూసేకరణ చేశారని, వాటిలో ఒక్క పరిశ్రమకు కూడా శంకుస్థాపన జరగలేదని తెలిపారు. ముఖ్యమంత్రి స్పందించి జిల్లాలో యువతకు ఉపాధి కోసం కార్యచరణ ప్రకటించాలన్నారు. జిల్లా అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వ పెద్దలు ముఖ్యమంత్రిపై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా కోశాధికారి ఎ.జగన్మోహన్‌రావు, జిల్లా కార్యదర్శులు బి.రమణ, సిహెచ్ వెంకటేష్ పాల్గొన్నారు.

## గురుకులంలో డయేరియా కలకలం



**కురుపాం, పతాకం న్యూస్:** కురుపాంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో డయేరియా వ్యాప్తి ఆందోళనకు గురిచేస్తోంది. ఆరో తరగతి విద్యార్థినులు మండంగి హేమలత, కోలక అనసూయ, కొండగొర్రె అనుశ్రీ ఒక్కసారిగా వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. దీంతో పాఠశాల ప్రాంగణంలోనే వైద్య సిబ్బంది సెలైన్ బాటిళ్లు ఎక్కించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. ఆరిక, ప్రణవి, శృతిదేవి అనే విద్యార్థినులను కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స కొనసాగిస్తున్నారు. హాస్టల్‌లో తాగునీటి నాణ్యత, ఆహార పరిశుభ్రతపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వసతిగృహాల్లో సరైన పారిశుధ్య చర్యలు లేకపోవడమే కారణమా? అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. ఈఘటనతో పిల్లలను భరోసాతో గురుకులంలో చేర్పించిన తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్య భద్రతపై నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని వారు హెచ్చరిస్తున్నారు. వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి, పూర్తి స్థాయి విచారణ చేపట్టిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## డేటా సెంటర్‌కు 60 ఎకరాలు అవసరం

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ప్రముఖ ఐటీ సంస్థ 'సిఫీ'కి డేటా అండ్ కేబుల్ ల్యాండింగ్ సెంటర్ నిమిత్తం ప్రభుత్వం పరదేశిపాలెంలో 25 ఎకరాలు కేటాయించింది. అయితే కనీసం 60 ఎకరాలు కావాలని ఆ కంపెనీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతోంది. దేశంలో పలు నగరాల్లో డేటా, కేబుల్ ల్యాండింగ్ సెంటర్లు నిర్వహిస్తున్న సిఫీ విశాఖలో కార్యకలాపాలు చేపట్టేందుకు ముందుకువచ్చింది. ఆ కంపెనీకి ప్రభుత్వం మధురవాడ ఐటీ పార్కులో హిల్-3పై మూడెకరాలు కేటాయించగా, గత నెలలో సీఎం చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా పరదేశిపాలెంలో మరో 25 ఎకరాల భూమి కేటాయించారు. అయితే భారీ స్థాయిలో డేటా, ల్యాండింగ్ సెంటర్ ఏర్పాటుచేయాలంటే కనీసం 60 ఎకరాలు అవసరమని సంబంధిత కంపెనీ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లా యంత్రాంగం వద్ద అదే ప్రతిపాదన ఉంచారు. పరదేశిపాలెంలో ప్రస్తుతం కేటాయించిన 25 ఎకరాలకు ఆనుకుని మరో 10 నుంచి 15 ఎకరాలు ఇచ్చేందుకు అవకాశం ఉందని జిల్లా యంత్రాంగం పేర్కొన్నట్టు తెలిసింది. ఒకేచోట 60 ఎకరాలు కేటాయించాలని, పరదేశిపాలెం కాకపోతే మరోచోట ఇవ్వాలని సిఫీ కోరడంతో ఆనందపురం మండలం జగన్నాథపురంలో 60 ఎకరాలు ఇస్తామని ప్రతిపాదించారు. కానీ, మధురవాడ, కాపులుప్పాడ ప్రాంతాల్లోనే 60 ఎకరాలు ఇస్తే బాగుంటుందని సిఫీ ప్రతినిధులు కోరారు.

## పాల డైయిరీలపై సమగ్ర తనిఖీలు చేయాలి



**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** పాల కల్తీ ఘటన నేపథ్యంలో జిల్లాలోని అన్ని పాల డైరీల్లో సమగ్ర తనిఖీలు నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ డిమాండ్ చేశారు. నగరంలోని రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆసుపత్రిలో పాల కల్తీ బాధితులతోపాటు, వారి కుటుంబ సభ్యులను సిపిఎం బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారుల తల్లిదండ్రుల తోపాటు, ఆసుపత్రి వైద్యులతో ఈ బృందం మాట్లాడింది. ఈ సందర్భంగా అరుణ్ మాట్లా డుతూ రెయిన్‌బో ఆసుపత్రిలో ముగ్గురు చిన్నారులు చికిత్స పొందుతున్నారని అన్నారు. చిన్నారుల కుటుంబాల్లో హృదయ విధార కరమైన పరిస్థితి నెలకొందన్నారు. చిన్న పిల్లలకు పట్టించే పాలు విషయంలోనూ అమానవీయంగా ప్రవర్తించడం దారుణ మన్నారు. జిల్లాలో పాల కేంద్రాలు ఎన్ని ఉన్నాయి? వాటిలో ఎన్నింటికి అనుమతులు ఉన్నాయి? ఎన్నింటికీ అనుమతులు లేవు? అనుమతులు ఉన్న పాల కేంద్రాల్లో నిబంధ నలకు అనుగుణంగా నిర్వహణ జరుగుతుం దా? అనుమతులు లేకుండా నిర్వహణ చేస్తున్న వాటిపై అధికార యంత్రాంగం ఏం చర్యలు తీసుకున్నారో ప్రజలకు తెలియ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బాధితులతో మాట్లాడే క్రమంలో ఒక ఘోరమైన అంశం వెలుగులోకి వచ్చిందన్నారు. ఒక బాబును రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తీసు కళ్లితే రాత్రి 11 గంటల నుంచి ఉదయం వరకూ ఆసుపత్రిలో ఉంచి అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జిజిహెచ్‌కు తరలించారని తెలిపారు. కాకినాడ జిజిహెచ్‌లో నాలుగు గంటల తరువాత తమ వద్ద డయాలసిస్ యూనిట్ లేదని చెప్పడంతో తిరిగి కుటుంబీకులు ఆ బాలుడిని రాజమ హేంద్రవరంలో ప్రయివేటు ఆసుపత్రికి తీసుకొచ్చారని తెలిపారు. ఈ లోపు ఆ బాబుకి క్రియేటినిన్ మూడు పాయింట్లు పెరిగిపోయిం దన్నారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి సైతం మెరుగైన వైద్యం కోసం ఇక్కడకు రిఫర్ చేస్తున్నారని, అయితే ఇక్కడ అవసరమైన సౌకర్యాలు లేకపోవడంతో కాకినాడకు రిఫర్ చేస్తున్నారని అన్నారు. ప్రస్తుత ఘటన ఆధారంగా మెడికల్ సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేశామని చెబుతున్న ప్రభుత్వం ఆసుపత్రిలో అవసరమైన పరికరాలను ఎందుకు సమకూర్చడం లేదని ప్రశ్నించారు.

## జింబాబ్వేపై 72 పరుగుల తేడాతో

# టీమిండియా గెలుపు




ఐసిసి టి20 ప్రపంచకప్ సెమీస్ రేసులో టీమిండియా నిలిచింది. చిదంబరం స్టేడియంలో జింబాబ్వేతో జరిగిన కీలక పోరులో టీమిండియా 72 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారతజట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 256పరుగుల భారీస్కోర్ నమోదు చేసింది. టి20 ప్రపంచకప్ చరిత్రలో ఇది రెండో అత్యధిక స్కోర్. భారీ ఛేదనలో జింబాబ్వే నిర్ణీత ఓవర్లు ముగిసేసరికి 6 వికెట్ల నష్టానికి 184 పరుగులే చేసింది. ఓపెనర్ బెన్నెట్(97నాటౌట్; 59బంతుల్లో 8ఫోర్లు, 6సిక్స ర్లు)కి తోడు కెప్టెన్ సికిందర్ రాజా(31) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. చివరకు కొండంత లక్ష్యాన్ని ఛేదించలేక జింబాబ్వే 184పరుగులకే పరిమితమైంది. భారత బౌలర్లలో ఆర్ష్‌దీప్ సింగ్‌కు మూడు, వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్, దూబేకు ఒక్కో వికెట్ దక్కాయి. ఈ గెలుపుతో భారతజట్టు గ్రూప్-1లో 2వ స్థానానికి ఎగబాకింది. మార్చి 1న ఆదివారం వెస్టిండీస్‌పై భారతజట్టు గెలిస్తేనే సెమీస్ బెర్త్ దక్కనుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ హార్దిక్ పాండ్యాకు దక్కింది.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత ఓపెనర్లు శు భారంభమిచ్చారు. అభిషేక్‌కు జతగా ఇన్నింగ్స్ ఆరంభించిన సంజు శాంసన్(24) క్రీజ్‌లో ఉన్నంతసేపు తనదైన స్టయిల్‌లో చెలరేగి ఆడాడు. రెండోబంతినే సిక్సర్‌గా మలిచిన సంజు.. ఆ తర్వాత మపోస ఓవర్లు ఫోర్ కొట్టాడు. భారతజట్టు స్కోర్ 46పరుగుల వద్ద సంజు శాంసన్(24) ఔటయ్యాడు.

ఆ తర్వాత అభిషేక్(55), ఇషాన్ కిషన్(38) కూడా అదే జోరును కొనసాగించారు. పవర్ ప్లే చివరి బంతిని అభిషేక్ సిక్సర్‌గా మలిచాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(33) కూడా అదే స్థాయిలో బ్యాటింగ్ చేశారు. చివర్లో హార్దిక్ పాండ్యా(50నాటౌట్; 23బంతుల్లో 2ఫోర్లు, 4సిక్సర్లు), తిలక్ వర్మ(44నాటౌట్; 16బంతుల్లో 3ఫోర్లు, 4సిక్సర్లు) ధనా ధన్ ఇన్నింగ్స్‌తో మెరిసారు. దీంతో భారతజట్టు నిర్ణీత ఓవర్లు ముగిసేసరికి 256పరుగుల భారీస్కోర్ నమోదు చేసింది. జింబాబ్వే బౌలర్లలో నరవా, ముజరబ్బాని, మపోసా, సికిందర్ రాజాలకు ఒక్కో వికెట్ దక్కాయి.

ఇండియా ఇన్నింగ్స్: సంజు శాంసన్ (సి)బర్ల్ (బి)ముజరబాని 24, అభిషేక్ శర్మ (సి)సికిందర్ రాజా (బి)మపోసా 55, ఇషాన్ కిషన్ (సి)నరవా (బి)సికిందర్ రాజా 38, సూర్యకుమార్ (సి)ముసెకివా (బి)నరవా 33, హార్దిక్ పాండ్యా (నాటౌట్) 50, తిలక్ వర్మ (నాటౌట్) 44, అదనం 12. (20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 256పరుగులు. వికెట్ల పతనం: 1/48, 2/120, 3/150, 4/172 బౌలింగ్: నరవా 4-0-62-1, ముజరబాని4-0-43-1, మపోసా 2-0-40-1, ఇవాన్స్ 4-0-52-0, సికిందర్ 3-0-29-1, బెన్నెట్ 2-0-16-0, బర్ల్ 1-0-10-0

# కుక్క కరిచినప్పుడు ఏం చేయాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?



కుక్క కరిచినప్పుడు ఏం చేయాలి.. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి..? పెంపుడు జంతువుల్లో కుక్కలు కూడా ఒకటి. వీటిని పెంచుకోవడానికి చాలా మంది ఇష్టపడతారు. అయితే కొన్నిసార్లు ఇవి ప్రమాదాన్ని కలిగిస్తాయి. అనుకోకుండా కొందరు కుక్క కాటుకు గురవుతూ ఉంటారు. ఈ మధ్యకాలంలో వీధికుక్కల కాటు బారిన కూడా చాలా మంది పడుతున్నారు. పెంపుడు జంతువుల్లో కుక్కలు కూడా ఒకటి. వీటిని పెంచుకోవడానికి చాలా మంది ఇష్టపడతారు. అయితే కొన్నిసార్లు ఇవి ప్రమాదాన్ని కలిగిస్తాయి. అనుకోకుండా కొందరు కుక్క కాటుకు గురవుతూ ఉంటారు. ఈ మధ్యకాలంలో వీధికుక్కల కాటు బారిన కూడా చాలా మంది పడుతున్నారు. అయితే కుక్క కాటును అస్సలు విస్మరించకూడదు. కుక్కకాటు రేబిస్ తో సహా తీవ్రమైన అనారోగ్య సమస్యలను కలిగిస్తుంది. పెంపుడు కుక్క కరిచినా, వీధి కుక్క కరిచినా వెంటనే తగిన చికిత్స తీసుకోవడం చాలా అవసరం. కుక్క కాటు కొన్నిసార్లు ప్రాణాంతకంగా మారే అవకాశం కూడా ఉంది. కనుక కుక్క కరిచిన వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

కుక్క కాటు తరువాత ముందుగా భయపడకూడదు. కుక్క కరిచిన చోట గాయాన్ని సబ్బుతో 10 నుండి 15 నిమిషాల పాటు శుభ్రమైన నీటితో బాగా కడగాలి. తరువాత వెంటనే ఆసుపత్రికి వెళ్లాలి. గాయం తీవ్రతను బట్టి వైద్యులు ఇంజెక్షన్ లు ఇస్తారు. రేబిస్ తో పాటు టెటనస్ వచ్చే ప్రమాదం ఉన్నందున టెటనస్ షాట్ కూడా తీసుకోవాలి. కనీసం 4 నుండి 5 మోతాదులు తీసుకోవాలి. ఇది రేబిస్ నుండి రక్షించడంలో సహాయపడుతుంది. వైద్యుడు సూచించిన మందులను వాడడం మంచిది. కుక్క కాటును నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ప్రథమచికిత్స తీసుకుని వైద్యుడిని సంప్రదించి తగిన మందులు, ఇంజెక్షన్ లు వాడడం మంచిది. కుక్కకాటు కారణంగా కొన్నిసార్లు ప్రాణాలు పోయే అవకాశం కూడా ఉంది కనుక దీనిని అస్సలు తేలికగా తీసుకోకూడదని వైద్యులు సూచిస్తున్నారు.

అలాగే కుక్క కాటు తరువాత కొన్ని ఆహారాలను తీసుకోవడం మానేయాలి. కుక్క కాటు తరువాత స్వీట్స్ ను తినకూడదు. స్వీట్స్ వాపులకు కారణమవుతాయి. వైద్యం నెమ్మదిస్తుంది. కుక్క కాటు నోటి దగ్గర లేదా ముఖం మీద ఉన్నట్టయితే నమలడం కష్టంగా ఉంటుంది. కనుక గట్టిగా ఉండే ఆహారాలను కూడా తీసుకోకూడదు. పాలు, పెరుగు వంటి పాల ఉత్పత్తులను కూడా తీసుకోకూడదు. ఇవి శ్లేష్మం ఉత్పత్తిని, బ్యాక్టీరియాను కూడా పెంచుతాయి. ఇన్ఫెక్షన్ మరింత తీవ్రతరం అవుతుంది. కుక్కకాటు తరువాత మద్యం కూడా తాగకూడదు. ఇది శరీరంలో రోగనిరోధక శక్తిని బలహీనపరుస్తుంది. ఇన్ఫెక్షన్ పెరుగుతుంది. కారంగా, పుల్లగా ఉండే ఆహారాలను కూడా తీసుకోకూడదు. ఇవి గాయాన్ని చికాకు పెట్టడంతో పాటు నొప్పిని కలిగిస్తాయి.

కాటుకు సంబంధించిన గాయం చిన్నదైనా సరే.. వెంటనే శుభ్రం చేయడం తప్పనిసరి. క్లీన్ వాటర్ తో గాయాన్ని బాగా కడిగి సబ్బుతో శుభ్రం చేయాలి. అనంతరం పోవిడోన్ ఐడెన్ లాంటి యాంటీసెప్టిక్ అప్లై చేయాలి. గాయాన్ని కవర్ చేసి రోజూ కట్టు మార్చాలి. ఇన్ఫెక్షన్ లక్షణాలు లాంటి ఎరుపు, వాపు, పుళ్లు లేదా తీవ్రమైన నొప్పి వస్తే డాక్టర్ ను వెంటనే సంప్రదించాలి. డాక్టర్ ఇచ్చిన యాంటీబయోటిక్ మందులను పూర్తిగా వాడాలి మధ్యలో మానేయకూడదు.

బలహీనమైన రోగనిరోధక శక్తి ఉన్నవారు లేదా డయాబెటిస్ ఉన్నవారికి కుక్క కాటు వల్ల తీవ్ర ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. కాటు లోతుగా ఉంటే నరాలు, కండరాలు, రక్తనాళాలు దెబ్బతినే అవకాశం ఉంటుంది. కొన్నిసార్లు పెద్ద కుక్కల కాటుతో ఎముకలు విరిగిపోవడం లేదా శాశ్వత మచ్చలు పడే ప్రమాదం కూడా ఉంది.

ఇవి మాత్రమే కాకుండా కొన్ని ప్రమాదకరమైన బ్యాక్టీరియాల వల్ల.. ఉదాహరణకు స్టెఫిలోకాకస్, పాశ్చరెల్లా, క్యాప్నోసైటోఫాగా వంటి వాటి వల్ల తీవ్రమైన ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంది. అలాగే టీకాల వివరాలు తెలియకపోతే రేబీస్ వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తే ప్రాణాలకు ప్రమాదం కలగొచ్చు.

కుక్క కాటు అనేది హఠాత్తుగా జరిగే విషయం కావచ్చు. అయితే అలాంటి సందర్భంలో భయపడకుండా, మానసికంగా ధైర్యంగా ఉండటం.. వెంటనే సరైన చర్యలు తీసుకోవడం ద్వారా తీవ్రమైన సమస్యల నుండి దూరంగా ఉండొచ్చు. టీకాల సమాచారం సేకరించడం, గాయాన్ని శుభ్రంగా ఉంచడం, ఇన్ఫెక్షన్ లక్షణాలను జాగ్రత్తగా గమనించడం ఆరోగ్యాన్ని రక్షించడంలో కీలకంగా ఉంటుంది. ప్రత్యేకంగా చిన్నపిల్లల విషయంలో మరింత జాగ్రత్త అవసరం.




# త్వరలో వెంకటేష్, కళ్యాణ్ రామ్‌తో సినిమా తీస్తా: అనిల్ రావిపూడి



వరుస విజయాలతో దూసుకుపోతున్న ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి తన తదుపరి చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ హీరోలుగా ఓ క్రేజీ మల్టీస్టారర్ రాబోతోందని వెల్లడించారు. 2027 సంక్రాంతి పండుగ కానుకగా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు సోషల్ మీడియా ద్వారా తెలిపారు.

చిరంజీవితో 'మన శంకరవరప్రసాద్ గారు' మూవీ తర్వాత కొంతకాలంగా అనిల్ రావిపూడి తదుపరి చిత్రంలో వెంకటేష్‌తో పాటు మరో హీరో ఎవరనే దానిపై రకరకాల ఊహాగానాలు వినిపించాయి. వాటన్నింటికీ తెరదించుతూ కళ్యాణ్ రామ్ పేరును ఖరారు చేయడంతో ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు పెరిగాయి.

ఈ సందర్భంగా అనిల్ రావిపూడి ఓ ఆసక్తికరమైన ట్వీట్ చేశారు. "నాకు మొదటిసారి 'బొమ్మ' తీసే అవకాశం ఇచ్చిన హీరో కళ్యాణ్ రామ్‌తో, నా మొదటి 'వందకోట్ల బొమ్మ' కొట్టిన హీరో వెంకటేష్ గారితో కలిసి 2027 మొదటి పండక్కి మీ ముందుకు వస్తున్నాం" అని పేర్కొన్నారు.

## నేడు జీవీఎంసీ కౌన్సిల్

# సర్వసభ్య సమావేశం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** జీవీఎంసీ సర్వసభ్య సమావేశం ఈనెల 28న నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకునేందుకు 37 అంశాలతో అజెండా తయారుచేసి సభ్యులకు ఇప్పటికే అందజేశారు. జీవీఎంసీ ప్రస్తుత పాలకవర్గం పదవీకాలం వచ్చే నెల 17వ తేదీతో ముగుస్తుండడంతో ఇదే చివరి సమావేశం కానున్నది. ఈ నేపథ్యంలో టేబుల్ అజెండాగా మరికొన్ని అంశాలను కౌన్సిల్ ముందుకు తీసుకువచ్చే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. ప్రధాన అజెండాలో ఉద్యోగుల సర్వీస్ మ్యాటర్‌కు సంబంధించిన అంశాలు, ఐటీ విభాగంలో సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లు, సర్వర్ల నిర్వహణకు సంబంధించిన విధులు నిర్వర్తిస్తున్న 17 మంది అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతాల చెల్లింపు, వీధి దీపాల విభాగంలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న 63 మంది సిబ్బంది కొనసాగింపు, హార్టికల్చర్ విభాగంలో పనిచేస్తున్న 37 మంది సిబ్బంది కొనసాగింపు, ప్రజారోగ్య విభాగంలో పారిశుధ్య నిర్వహణ, నివాసాల నుంచి ఘనవ్యర్థాల సేకరణ/నిర్వహణ, రోడ్లపై కుక్కలు, పందులు, పశువుల నియంత్రణ, డెంగ్యూ, మలేరియా నివారణకు జీటీఎస్ కేంద్రాల్లో పనిచేస్తున్న 5,468 మంది పొరుగు సేవల సిబ్బంది సేవలు మరో ఏడాది పొడిగింపుతోపాటు వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపే అంశాలను చేర్చారు.

# మృణాల్‌తో సినిమా చేయాలనుంది: అల్లు అర్జున్



టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, ప్రముఖ నటి మృణాల్ ఠాకూర్‌తో కలిసి పనిచేయాలనే తన ఆసక్తిని బయటపెట్టారు. 'పుష్ప 2: ది రూల్' చిత్రానికి ఉత్తమ నటుడిగా 70వ ఫిల్మ్‌ఫేర్ అవార్డు అందుకున్న సందర్భంగా మృణాల్ పంపిన అభినందనలకు ఆయన ఈ విధంగా స్పందించారు. ఈ పరిణామంతో వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా వస్తుందా అనే చర్చ మొదలైంది.

ఇటీవల జరిగిన 70వ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్‌లో అల్లు అర్జున్ 'పుష్ప 2' చిత్రంలోని నటనకు ఉత్తమ నటుడి అవార్డును గెలుచుకున్నారు. ఈ నేపథ్యంలో మృణాల్ ఠాకూర్ ఆయనకు ప్రత్యేకంగా పూల బొకేతో పాటు ఓ అభినందన సందేశాన్ని పంపారు. "ప్రతి ప్రదర్శనలో మీరు చూపించే అంకితభావం, తీవ్రత, అద్భుతమైన ప్రతిభ నిజంగా స్ఫూర్తిదాయకం. ఈ పురస్కారం మీకు అన్ని విధాలా అర్హమైనది" అని మృణాల్ తన సందేశంలో పేర్కొన్నారు.

మృణాల్ పంపిన బొకే, నోట్‌ను తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌లో పోస్ట్ చేసిన బన్నీ, భవిష్యత్తులో ఆమెతో కలిసి పనిచేయాలనుకుంటున్నట్లు తెలిపారు. "థ్యాంక్యూ సో మచ్ మృణాల్ ఠాకూర్. మీ అభినందన చాలా మధురంగా ఉంది. ఎప్పటికైనా మీతో కలిసి పనిచేయాలని ఆశిస్తున్నాను'' అని అల్లు అర్జున్ రాసుకొచ్చారు. ఇప్పటివరకు వీరిద్దరూ కలిసి నటించకపోవడంతో బన్నీ పోస్ట్ వైరల్‌గా మారింది.

ప్రస్తుతం అల్లు అర్జున్ 'పుష్ప' ఫ్రాంచైజీలోని మూడో భాగంతో పాటు లోకేశ్ కనగరాజ్, అట్లీ దర్శకత్వంలో సినిమాలకు సిద్ధమవుతున్నారు. మరోవైపు మృణాల్ ఠాకూర్, అడివి శేష్‌తో కలిసి నటించిన 'డకాయిట్' సినిమా విడుదల కోసం ఎదురుచూస్తున్నారు.






Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem, VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**